నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
మంగళవారం | మే21 , 2024 | www.navatelangana.com

నెల్లిబండలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవ తెలంగాణ నకిరేకల్



నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవం శ్రీ లింగమంతుల స్వామి జాతరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమంతుల స్వామి దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో బుట్ట పైకి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసిన అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు సీపీఐ(ఎం) మద్దతు

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ



నల్గొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్ అన్నారు. సోమవారం స్థానికంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర పార్టీ నిర్ణయించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం, ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. అదేవిధంగా, ఇప్పుడు కూడా బీజేపీని ఓడించటం కోసం ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు.



ఆధునిక వ్యవసాయం ద్వారానే అధిక దిగుబడులు వస్తాయని అధికారుల సూచనలు బాగానే ఉన్నాయి . కానీ యాంత్రీకరణ పరికరాలు లేకుండా వ్యవసాయం ముందుకు సాగదు . పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు వంటి పథకాలు అమలు చేయకపోవడంతో ఖరీఫ్ పై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. మంత్రివర్గ సమావేశంలోనైన రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేసేలా ప్రకటన వస్తుందని ఆశతో ఎదురుచూశారు. కానీ నిరాశే ఎదురైంది. మొదటి ప్రాధాన్యత రంగంగా గుర్తించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి . ఇప్పటికే దుక్కులు పాతం చేసుకొని రైతులు అదునుకోసం ఎదురు చూస్తున్నారు. ఆధునిక వ్యవసాయం అధిక దిగుబడుల కోసం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పంట సాగుకు అవసరమైన ఖరీఫ్ ప్రణాళిక నేటికీ సిద్ధం కాలేదు. యాంత్రీకరణ ,రైతుబంధు ,సబ్సిడీ విత్తనాల విషయంలో ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. అకాల వర్షాలు కురుస్తే.. రైతులు సాగుపై ఎటువంటి దృష్టి పెట్టాలో అవగాహన కల్పించలేదు.

ఖరారు కానీ... వ్యవసాయ ప్రణాళిక

- ఖరీఫ్ కు మరో పక్షం రోజులే
- యాంత్రీకరణ, సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేవు
- అరకొరగా ఎరువులు
- రైతుబంధు సమయానికి వచ్చేది అనుమానమే

నవతెలంగాణ- దేవరకొండ

నల్లగొండ జిల్లాలో13.67 లక్షల ఎకరాలు సాగయ్యేది. సాగును దృష్టిలో ఉంచుకొని రైతులకు సహకరించాల్సింది పోయి ఇప్పటికీ ఖరీఫ్ పై ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగు ప్రణాళిక ఏది..?

జిల్లాలో ఖరీఫ్ సమయం సమీపిస్తున్న రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదు. ప్రతి ఏటా సాగు వ్యయం రెట్టింపు అవుతుంది. విత్తనాలు ,కూలీలకు ,ఎరువులతో పాటు దుక్కులు చదును చేయడానికి ఎకరాకు 50. వేలకు పైగానే ఖర్చు అవుతుంది. ఆధునిక వ్యవసాయానికి యంత్రాల అవసరం ఎంతైనా ఉంది. ట్రాక్టర్లు, హార్వెస్టర్‌తో పాటు పంట చేతికి వచ్చే సమయంలో అనేక పరికరాలను ఉపయోగిస్తారు. రైతులకు యాంత్రీకరణ పరికరాలు ఉపయోగించాలని చెబుతున్నారు తప్ప వాటిని సబ్సిడీల ద్వారా సరఫరా చేయడం లేదు. ప్రతి ఏటా రైతుబంధు జూన్ మొదటి వారంలోనే ఇచ్చేవారు. ఈసారి రబీలో వేయాల్సిన డబ్బులే ఇప్పటికి వరకు జరిపారు. ఇక ముందు వేస్తారో కూడా తెలియదు. రైతు బంధు వేస్తే పెట్టుబడులకు కొంత ఊరట కలిగేది. వీటితో పాటు కోర్టు కేసులు, హత్యలు, వివాదాస్పద భూములకు రైతు బీమా ఇవ్వకపోవడంతో చనిపోయిన రైతు కుటుంబాలు రోడ్డునపడ్డాయి. వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పెరిగిన పెట్టుబడుల కనుగుణంగా పంట రుణాలను సైతం పెంచాల్సి ఉంది. ఇప్పటివరకు రైతుకు సంబంధించిన పథకాలు ఏవి అందలేదు.

మంత్రి మండలి సమీక్షా సమావేశంలో....

తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి సమీక్షా సమావేశం ఖరీఫ్ ప్రారంభంలో జరిగే సమావేశానికి ప్రాధాన్యత ఉంది .మంత్రిమండలిలో వ్యవసాయ రంగంపై చర్చించి రైతులకు ఇచ్చే రాయితీలు, సబ్సిడీవిత్తనాలు ,యంత్రాలు, రైతుబంధు వంటివి చెల్లించడంలో నిర్ణయాలు తీసుకుంటారని ఆశించిన రైతుల ఆశలపై నీళ్లు చల్లారు .సమీవేశంలో ఏమైనా నిర్ణయాలు తీసుకుంటుందేమోనని రైతు సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం ఆధునిక వ్యవసాయానికి అనుకూలంగా నిధులు విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

ఖరీఫ్ సాగు పై అధికారులు దృష్టి సారించాలి
కున్ రెడ్డి నాగిరెడ్డి
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. అకాల వర్షాలు పడితే ముందస్తు విత్తనాలు వేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా రైతులకు విత్తనాలు ఏ సమయంలో వేయాలో అవగాహన కల్పించాలి. రాయితీలు , సబ్సిడీలు, రైతుబంధు వంటివి ఇవ్వాలి. లేనిచో పంట దిగుబడి పై తీవ్ర ప్రభావం పడి రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

పత్తి ,వరి విత్తనాలు అందుబాటులో ....
శ్రావణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ,నల్లగొండ

జిల్లాలో ప,త్తి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే రైతులు కొనుగోలు చేస్తున్నారు. కొత్తగా ఏమి రాలేదు. యాంత్రీకరణ, విత్తన సబ్సిడీలు ఏమీ లేదు.

ఎమ్మెల్సీ ఎన్నికకు తగిన ఏర్పాట్లు చేయాలి

- 22న నల్గొండ,సూర్యాపేట జిల్లాల పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు
- 24న పీఓ,ఏపీఓ, సూక్ష్మపరిశీలకులకు 2 వ విడత శిక్షణ
- రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి



నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్, కౌంటింగ్‌లకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 22న నల్గొండ, సూర్యాపేట జిల్లాల పోలింగ్ సిబ్బందికి కౌంటింగ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని, ఇదేవిధంగా అవసరమైతే అన్ని 12 జిల్లాల్లో సైతం శిక్షణ నిర్వహించేలా చూడాలని కోరారు. 24న పీఓ, ఏపీఓ, సూక్ష్మపరిశీలకులకు 2వ విడత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రెండో విడత రాండమైజేషన్ సైతం అదే రోజు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు 5 వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి వంటి వాటిని సిద్ధం చేసుకోవాలన్నారు.. ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ కి సంబంధించి ఈనెల 20 నుండి 25 వరకు నల్గొండ జిల్లాకు సంబంధించి నల్గొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. పట్టబద్రుల శాసన మండల ఉప ఎన్నిక ప్రణాళిక, అభ్యర్థుల వ్యయనిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, నల్గొండ ఆర్డీవో రవి, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

95 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సంఘం ఆమోదం

వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ కు నల్గొండ జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు, 2 ఆక్సిలరి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పంపించిన ప్రతిపాదనలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరి చందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుండి ఉత్తర్వుల కాపీ అందిందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనుమతించిన పోలింగ్ కేంద్రాల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో మండల తహసిల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ప్రచురించనున్నట్లు ఆమె వెల్లడించారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

- సిహెచ్ .లక్ష్మీనారాయణ

నవతెలంగాణ - నల్లగొండ టౌన్



నల్గొండ జిల్లాలో వివిధ గ్రామపంచాయతీలో ఏడు నుండి పది నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే ఇప్పించకపోతే కలెక్టరేట్ ను ముట్టడిస్తామని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్ లో ఆ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 844 గ్రామపంచాయతీల్లో సుమారు 3400 మంది కార్మికులు పారిశుధ్యం మంచినీటి సరఫరా వీధిలైట్ల నిర్వహణ పన్నుల వసులు తదితర పనుల్లో ఎండనక వాననక కష్టపడి పని చేస్తున్న వారికి ఇవ్వాల్సిన కొద్దిపాటి వేతనాలు కూడా ఏడు నెలల నుండి 10నెలల వరకు పెండింగ్‌లో ఉన్నాయని దీనితో కార్మికులు అర్ధాకలితో అప్పుల భారంతో బతుకులు ఈడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వాలని అధికారులను అడిగితే డబ్బులు లేవని సమాధానం చెబుతున్నారని కడుపులు మార్చుకొని పని ఎలా చేస్తారని ప్రశ్నించారు. అధికారులు కార్మికుల తొలగించాలని కుట్రలు చేస్తున్నారని అది ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మా కష్టాలు పోతాయని ఆశపడ్డ కార్మికులకు వారి సమస్యలు పరిష్కారం కాకపోగా మరింతగా పెరిగాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి గ్రామపంచాయతీ కార్మికుల పైన ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న ఎంపీడీవో ఆఫీసుల ముందు ధర్నాలు చేస్తామని అప్పటికీ స్పందించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, యూనియన్ జిల్లా నాయకులు పొన్న అంజయ్య,ఎండి జహీర్,జి ఆశీర్వాదం, పి.సర్వయ్య, ఏ కోటయ్య,ఎర్రఅరుణ,కత్తుల రామలింగయ్య, నాంపల్లి నరేష్, పెద్దమ్మ, సుధాకర్, లక్ష్మయ్య, రమేష్, లింగస్వామి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలి

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల, మున్సిపల్ చైర్మెన్ బుర్రి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

వరంగల్, ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం నల్గొండ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో నల్గొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు తీన్మార్ మల్లన్న గెలిపించుకునే బాధ్యత మనదేనని అన్నారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిపించుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు.నల్గొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య లు మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓట్లతో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ మనిమద్దె సుమన్, కనగల్ జెడ్పిటిసి చిట్ల వెంకటేశం, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు డాక్టర్ ఏపీ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి, తీన్మార్ మల్లన్న టీం ఇన్చార్జి కొప్పు ప్రవీణ్, పలువురు కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రూపా అశోక్ సుందర్, సూరెడ్డి సరస్వతి, నాగమణి రెడ్డి, లలిత, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

నల్గొండ కలెక్టరేట్ లో 10వ తరగతితో 10జీపీఏ సాధించిన గిరిజన బాలుర వసతిగృహం విద్యార్థి రమావత్ సర్దార్ కు ప్రసంశ పత్రం,మెమొంటోలను కలెక్టర్ దాసరి హరి చందన సోమవారం అందజేశారు. ఎంఆర్ఓ సునంద జ్ఞాపకార్థం భర్త ఏటి డబ్ల్యూ లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 5వేల రివార్డును విద్యార్థికి అందజేశారు. వారితో పాటు10జీపీఏ సాధించిన దేవరకొండ ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులకు రూ.5వేలు చొప్పున రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానాలలో ఉద్యోగాలు సాధించాలన్నారు . ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యు రాజ్ కుమార్ ట్రైబల్ అధికారి డివి నాయక్, గిరిజన సంఘం నాయకులు కుర్ర శంకర్ నాయక్, రమావత్ స్వామి నాయక్ ,అజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి పై విచారణ



నవతెలంగాణ- చండూర్

మున్సిపాలిటీలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ కట్ల బిక్షం, జర్నలిస్టు సాగర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు జారీచేసిన కార్యదర్శిని పూర్తి రికార్డులతో హాజరుకావాలని డీపీఓ ఆదేశించినప్పటికీ కార్యదర్శి ఎలాంటి రికార్డులు లేకుండా సమావేశానికి రావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆధారాలతో ధృవీకరణ పత్రాలు జారీ చేశారో ఆధారాలు సమర్పించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన ఎనిమిది సంవత్సరాలకు ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకోవటం పట్ల వారు అనుమానం వ్యక్తం చేశారు.చండూరు గ్రామపంచాయతీగా కొనసాగిన సమయంలో ఇక్కడ పనిచేసిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు తమవద్ద పంచాయతీకి సంబంధించిన రికార్డులు లేవని చెప్పటంపట్ల విచారణ అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేకపోవడం పట్ల ఇంకా ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో విచారణ చేయాలని అధికారులను జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అనంతరం అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఖాళీ ఇంటి స్థలాన్ని వారు పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలకు, స్థలానికి ఎలాంటి సంబంధం లేకపోవడంతో తప్పు జరిగినట్టు వారు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఒకే రోజు తొమ్మిది డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పుడు రిజిస్ట్రేషన్ లు అన్ని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సమయంలో నే కావటం పట్ల అనుమానం వ్యక్తంచేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్న ఇంటి నెంబర్లకు,ఇంటి స్థలానికి పొంతన లేక పోవడం పట్ల విచారణ అధికారులు ఆశ్చర్య వ్యక్తం చేశారు. రెండు రోజులలో పూర్తిస్థాయి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అనురాధ, జర్నలిస్టులు వంగూరి నగేష్,కంచర్ల అంజయ్య,ఎజాజుద్దీన్,సంగెపు మల్లేష్,బొల్లం పరమేష్, గంట శ్రీను,జక్కలి నాగరాజు,కర్నాటి వెంకటేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పుత్రుడు మునీశ్వర్‌కు ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అడవిదేవులపల్లి మండలంలోని బాల్నేపల్లి గ్రామ నివాసి రామావత్ మునీశ్వర్ కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ ప్రదానం చేశారు. ఏ స్టడీ ఆన్ పెర్ఫార్మన్స్ ఎవాల్యూయేషన్ అఫ్ ఏ-నామ్ విత్ రిఫరెన్స్ టు సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ విభాగం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మాజీ వైస్ ఛాన్సలర్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కేరళ, ప్రొఫెసర్ కే.కృష్ణ చైతన్య ల పర్యవేక్షణలో స్టడీ చేసి డాక్టరేట్ పొందినట్లు పేర్కొన్నారు. అడవిదేవులపల్లిమండలం ,బాల్నేపల్లి గ్రామానికి చెందిన రామావత్ సేవ్య కుమారుడైన మునీశ్వర్ డాక్టరేట్ పొందడం అడవిదేవులపల్లి మండలానికే గర్వకారణం అని మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ వ్యవసాయ కుటుంబ నేపథ్యంతో వచ్చిన రామావత్ మునీశ్వర్ చిన్న తనం నుండే విద్యలో ప్రతిభ చూపిస్తూ ప్రాథమిక విద్య ను బాల్నేపల్లి ప్రభుత్వం పాఠశాలలో విద్యనభ్యసించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఉన్నత విద్యలో ఎం కామ్, ఎంబీఏ, పీజీలు పూర్తిచేసి రెండింటిలో యూజీసీనెట్, టీఎస్ సెట్, సాధించడంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, నేషనల్, ఇంటర్నేషనల్ ఆర్టికల్స్‌ను ప్రచురణ చేశారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

27న డిగ్రీ రెండు ,మూడు సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

నవ తెలంగాణ -నార్కట్ పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నిర్వహణ తేదీల్లో స్వల్ప మార్పులు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా జి ఉపేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న జరగవలసిన రెండు ,మూడవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలను జూన్ 13న నిర్వహించనున్నట్లు తెలిపారు.

2 లక్షల మెజార్టీతో రఘువీర్ రెడ్డి గెలుపు ఖాయం

నవతెలంగాణ- చింతపల్లి

రెండు లక్షల మెజార్టీతో కుందూరు రఘువీర్ రెడ్డి విజయం సాధిస్తారని మాజీ ఎంపీటీసీ,కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉప్పు శ్రీశైలం, మాజీ సర్పంచ్ గౌని గీతా జంగయ్య గౌడ్ అన్నారు. సోమవారం వారు చింతపల్లి మండలంలోని కురుమేడ్ గేట్ లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల, సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని, ఆరోగ్యశ్రీ పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని, ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిందని భూ దందాలు సెటిల్మెంట్లు, రౌడీయిజం రాజ్యమేలుందని వారన్నారు. ఆగస్టు 15 తేదీ నుండి రైతు రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తుందని, వృద్ధులు వితంతుల వికలాంగుల ఆసరా పింఛన్లు పెంచే ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఎలక్షన్లలో మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చి, ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తారని వారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌని జంగయ్య, మాజీ కో ఆప్షన్ నెంబర్ షఫీ బాబా, మైనార్టీ సెల్ నాయకులు ఇబ్రహీం,ఖాదర్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణానికి కమిటీ సేవలు ప్రశంసనీయం

- మున్సిపల్ చైర్మెన్ తిరునగరు భార్గవ్

నవతెలంగాణ-మిర్యాలగూడ



ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యుల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మెన్ తిరునగరు భార్గవ్ అన్నారు. సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు కోల సైదులు ముదిరాజ్ కమిటీ సభ్యులు చైర్మెన్‌భార్గవ్ ను కలిసి ఆలయం నిర్మాణం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులందరినీ ఆయన ఘనంగా సన్మానించారు. అదే విధంగా రూ. 1,54, 116 తిరునగర్ గంగాధర్, రమేష్, రాజేష్ ల జ్ఞాపకార్థం తిరునగరు మల్లేశ్వరమ్మ, తిరునగరు నాగలక్ష్మి భార్గవ్ లు చందా ప్రకటించినట్లు కమిటీ సభ్యులు సైదులు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోలా సైదులు, కోశాధికారి కోలా రామస్వామి, కార్య నిర్వాహన అధ్యక్షులు, బీజేపీ అధ్యక్షులు బంటు సైదులు , మాజీ మున్సిపల్ చైర్మెన్ మెరుగు రోశయ్య , సలహాదారులు బంటు శ్రీనివాస్ , బంటు లక్ష్మీనారాయణ ముదిరాజ్, పబ్లిసిటీ సెక్రటరీ కొంక ఎంకన్న, బంటు దుర్గయ్య లింగంపల్లి శ్రీనివాసు , నక్క బిక్షం, మెరుగు సంజీవ్, కోలా రవి, బంటు సైదులు , మామిడాల ఎల్లమ్మ , బంటు సైదులు, దడవాయి పల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎస్



మండల పరిధిలోనితుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో క్రేన్‌తో వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది.ఎస్సై సైదులు తెలిపిన వివరాలప్రకారం.. తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల కనకయ్య కుమారుడు వరికుప్పలఅఖిల్(19) కుటుంబ సభ్యులతో వ్యవసాయ బావి వద్ద పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటుషాక్ తగిలి మృతిచెందాడు. మృతుని తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద సూర్యాపేట జిల్లాకు (31) సీట్లు మంజూరు అయ్యాయని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకంలో 3వ తరగతికి (16) సీట్లు, 5వ తరగతికి (08) సీట్లు, 8వ తరగతికి (07) సీట్లు కేటాయించామని తెలిపారు.జిల్లాలోని గిరిజనతెగలకు చెందిన లంబాడ, ఎరుకల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తు చివరితేదీ 06.06.2024లో చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తుఫారాలు ఈ నెల 21నుంచి 06 జూన్ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం, రూమ్ నెంబర్.ఎఫ్-5, మొదటిఅంతస్తులో ఉచితంగా పొందాలన్నారు.దరఖాస్తుచేసుకునే వారు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రం, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల యొక్క బోనఫైడ్, పుట్టినతేదీ ధ్రువీకరణపత్రం,పాస్‌ఫొటో జతపర్చాలన్నారు.ఈఅవకాశాన్ని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



నృసింహుని కల్యాణానికి ఏర్పాటు పూర్తి

నవతెలంగాణ-మఠంపల్లి

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మట్టపల్లి లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడురోజులుగా ప్రత్యేకపూజ కార్యక్రమం జరుగుతుంది.మంగళవారం అర్థ జిల్లా కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని అనువంశికధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరువిజయ్‌కుమార్, కార్యనిర్వహణఅధికారి సిరికొండ నవీన్ తెలిపారు. సోమవారం ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకలఏర్పాట్లు చేశారు.ఉత్సవాల సందర్భంగా భజన, కోలాట కార్యక్రమాలు,లక్ష్మీనరసింహుని బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఆలయం వద్దఉన్న అన్ని అన్నదానసత్రాల్లో అన్నదానం చేసేందుకు ఆయాసత్రాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. వీరితో బాటు నాగార్జున సిమెంట్స్, సాగర్ సిమెంట్స్,భవ్య సిమెంట్స్ వారు మజ్జిగ,అల్పాహారం,వైద్య సౌకర్యాలు ఏర్పాటుచేశారు. కల్యాణానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కోదాడ డిపో నుండి ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఐ(ఎం) మద్దతు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ

నవతెలంగాణ-సూర్యాపేట



నల్లగొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ అన్నారు. సోమవారం స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు.నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని తెలిపారు.పార్లమెంట్ ఎన్నికలలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం, ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. అదేవిధంగా, ఇప్పుడు కూడా బీజేపీని ఓడించడం కోసం ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నదని పేర్కొన్నారు. పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు. మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) పిలుపుని స్తుందన్నారు.పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల రాకేశ్‌రెడ్డిని ఓటేసి గెలిపించాలి

నవతెలంగాణ-తుంగతుర్తి



తెలంగాణకు కావలసింది ధిక్కారస్వరాలు,ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు అని..అధికారస్వరాలు కాదని బీఆర్ఎస్ మండల నాయకులు మట్టపల్లి వెంకట్ అన్నారు.సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపి ంచాలని కోరారు.రాకేష్‌రెడ్డి హన్మకొండ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో సామాన్య రైతుకుటుంబంలో జన్మించారని,ప్రతిష్టాత్మక సంస్థ బిట్స్‌పిలానీలో విద్యాభ్యాసం చేశారని పేర్కొన్నారు.రాకేష్‌రెడ్డికే తొలి ప్రాధాన్యత ఓటు,ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో మీ మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రజాసేవ చేయాలనేఉద్దేశంతో ప్రత్యక్షరాజకీయాల్లోకి అడుగు పెట్టారన్నారు. ఉన్నతవిద్యావంతుడు ప్రశ్నించేతత్వం కలిగిన రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల గొంతుకగా నిలిచి నిరుద్యోగుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తారని కోరారు.

ఏపూర్‌వాసికి ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్



మండలం ఏపూర్ గ్రామానికి చెందిన మునిగడప పూర్ణాచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు.యూనివర్సిటీ కాలేజ్ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ (సీఎస్ఈ)లో ప్రొఫెసర్ ఆదిలక్ష్మి పర్యావేక్షణలో 'నోవెల్ డీప్‌లెర్నిగ్ అప్రచేస్ పర్ ఎవాల్యుటింగ్ మార్క్స్'అనే అంశంపై డాక్టరేట్ సాధించినట్టు పూర్ణాచారి సోమవారం వివరించారు.

ఉచిత బస్సుప్రయాణం తప్ప ఏ ఒక్కటి అమలు కాలే ....

- గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి
- మాజీ మంత్రి ఈటల రాజేందర్

నవతెలంగాణ-కోదాడరూరల్



ఉచితబస్సుప్రయాణం తప్పా కాంగ్రెస్ హామీలు ఏఒక్కటి అమలుకాలేదని మాజీ మంత్రి ఈటలరాజేందర్,బీజేపీజాతీయ నాయకులు బీబీపాటిల్ విమర్శించారు.సోమవారం పట్టణంలోని మేళ్లచెర్వు కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు.గరీబీ హఠావో అని ఇందిరాగాంధీ నుండి మొదలుకొని నేడు రాహుల్‌గాంధీ వరకు అంటున్నారే తప్ప వాళ్ళ హయాంలో పేదలకు చేసిందేమీ లేదన్నారు.రూ 500,రూ.2000 నోట్లతో చిల్లరకు ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఫోన్‌పే గూగుల్ పే ద్వారా నగదు బదిలీలు సులభతరం చేసిన ప్రభుత్వం బీజేపీ అన్నారు.ఫోన్‌పే, గూగుల్‌పేలతో నగదు బదిలీలకు పదేండ్లు పడితే మోడీ పాలనలో భారతదేశంలో సగటు మహిళకు మూడేండ్లు మాత్రమే పట్టిందని నేడు మార్కెట్‌లో ఏది కొనుగోలు చేసినా ఇబ్బందుల్లేవన్నారు.భారతదేశం నుండి మెడిసిన్ చదవడానికి రష్యా ఉక్రెయిన్ దేశాలకు వెళ్లిన విద్యార్థులు అక్కడ యుద్ధంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతుంటే ఇక్కడి తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకున్న ప్రధాని మోడీ భారతదేశానికి సురక్షితంగా వచ్చే విధంగా ఏర్పాటు చేశారన్నారు.అనంతరం నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి మాట్లాడుతూ మోడీ సంక్షేమ పథకాలతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొబ్బభాగ్యరెడ్డి, కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాలనారాయణ, నూనెసులోచన, అంజియాదవ్, అక్కిరాజుసంపత్, కవితా రెడ్డి, బొలిషెట్టి కృష్ణయ్య, వివిధ మండలాల అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

విద్యుద్ఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన సూర్యాపేట మండలపరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వీరబోయిన సైదులు తన గేదెను రోజు మాదిరిగానే మేతకు వదిలాడు.కాగా గేదె మేత మేసుకుంటూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మేతమేస్తుండగా ప్రమాదవ శాత్తు ట్రాన్స్‌ఫార్మర్ గల ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కాగా పాడిగేదే అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదే విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతు వీరబోయిన సైదులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.





తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు

నవతెలంగాణ-మోతె

నల్లగొండ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్టిపల్లి సైదులు అన్నారు.సోమవారం మోతే మండలకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని తెలిపారు.పార్లమెంట్ ఎన్నికలలో లౌకికవిలువలు, ప్రజాస్వామ్యం కోసం, ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్టు తెలిపారు.బీజేపీని ఓడించడం కోసం ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు. మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) పిలుపునిస్తుందని పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఈ సమావేశంలో మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు గుంటగాని ఏసు, కిన్నెరపోతయ్య, చర్లపల్లి మల్లయ్య, దోసపాటి శ్రీను, నాయకులు గురజాలవెంకన్న,కొండ శ్రీరాములు,ఇంద్ల వెంకన్న, గురజాల చిన్నవెంకన్న తదితరులు పాల్గొన్నారు.



చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని వినతి

నవతెలంగాణ-కోదాడరూరల్

అనంతగిరి మండల పరిధిలోని వాయలసింగారంలో గల ఊర చెరువు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని ఆ గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్ సంఘం సభ్యులు, రైతులు మాజీ మంత్రి ఈటల. రాజేందర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుపై 350 మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని,అక్రమంగా చెరువులో మట్టితవ్వి మునక భూములను పైకి లేపి ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.ఇప్పటికే 150 ఎకరాలు శిఖం భూమిలో చెరువు మట్టితో పూడ్చి నింపారని చెరువు పైనే ఆధారపడి సేద్యం చేసుకుంటున్న రైతులకు భవిష్యత్‌లో నీటి కష్టాలు ఎదురవుతాయని వివరించారు.అధికారులచే వెంటనే ఎఫ్‌టీఎల్ సర్వే చేయించి చెరువుచుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో వంగవీటి. శ్రీనివాసరావు, పగిడి.రామారావు, శీలంసైదులు తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను భారీమెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-చివ్వెంల



వరంగల్,ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధరావత్ వీరన్ననాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, 400 సీట్లు ఇవ్వాలని ప్రధాని మోడీ ప్రచారం చేస్తున్నారని, దీంతో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటుతో పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ హక్కులను కాలరాసేందుకు బీజేపీ యత్నిస్తుందని విమర్శించారు.ఆరేండ్లపాటు పట్టభద్రులకు అండగాఉండాలని పల్లారాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే మూడేండ్లకాలంలోనే రాజీనామా చేసి పట్టభద్రులను నడిరోడ్డు మీద వదిలేశారన్నారు.తీన్మార్‌మల్లన్న ఎందుకు జైలుకుపోయిండు..ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయో....వీటికి కారణం ఎవరో పట్టభద్రులకు తెలుసన్నారు.మూడు ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉందన్నారు.పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించుకుందామని కోరారు.

ఘనంగా సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినవేడుకలను ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపూరి సత్యరాజు మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని రంగాథియేటర్‌లో భారీగా తరలివచ్చిన అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు, అన్నదానాలు చేపడుతున్నామని తెలిపారు.తమ అభిమాన నటుడు ఇటువంటి జన్మదినవేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షులు బండ్ల దాసు, అనంతగిరి మండల అధ్యక్షులు భూక్యా. సంతోష్‌నాయక్,మునగాల మండలఅధ్యక్షులు మెడిసిమెట్ల.నవీన్, జవ్వాజి ప్రవీణ్‌చౌదరి,బుర్ర.ప్రవీణ్, కొత్తపల్లి.సాయి,గోపి, ఉపేందర్,గణేష్, యశ్వంత్ జానీ బాబా, గోవింద్‌నాయక్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలి

- కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ బీఎస్.లత

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లత సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నెల ఉదయం 9.00 నుండి మధ్యహం 12.00 గంటలవరకు ప్రథమ సంవత్సరం పరీక్షల ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు అలాగే జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలన్నారు.అన్ని కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు, నిరంతర విద్యుత్, తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. సూర్యాపేటలో 8 కేంద్రాలు, తిరుమలగిరిలో ఒకటి, తుంగతుర్తి ఒకటి, నెమ్మికల్ లో ఒకటి కోదాడలో 5 కేంద్రాలు, నడిగూడెంలో ఒకటి, హుజూర్ నగర్‌లో రెండు, నెరేడుచర్లలో ఒకటి, మఠంపల్లిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు.ద్వితీయ సంవత్సరం జూన్ 4నుండి 8 వరకు ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు అలాగే మధ్యాహ్నం 2.00 నుండి 5.00 గంటల వరకు అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష తేదీ. 10.6.2024 న ఉదయం 9.00 గంటలకు ఉంటుందన్నారు.అలాగే తేదీ. 11.6.2024న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగునని తెలిపారు. తేదీ.12.6.2024న ఎథిక్స్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్లు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లుగా నియమించామన్నారు. పరీక్షాకేంద్రాల్లో పోలీస్ బందోబస్తు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో డీఐఈఓ కృష్ణయ్య, సెక్షన్ పర్యవేక్షకులు పద్మారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్

వర్షాకాలం సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై జీలుగ, పెసలు, కందులు,వేరుశనగలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ కౌలు రైతులసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించాలని కోరారు.ఆయకట్టు ప్రాంతంలోని రైతులు వ్యవసాయ పనులకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటున్నందున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, వారికి తగిన సూచనలు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రేపాకుల మురళి,పాశం వీరబాబు,ఇందిరాలలక్ష్మీ, వెంకటి,వెంకన్న,వీరయ్య,సైదులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరుడు భరత్‌గౌడ్ 11వ వర్ధంతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని టౌన్‌హాల్‌లో సోమవారం తెలంగాణ కోసం ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరుడు సోమగాని భరత్‌గౌడ్ 11వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు అనంతరం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె.సైదా, గౌడ సొసైటీ అధ్యక్షుడు వల్లభదాసు కృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను పట్టించుకోలేదన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ అమరవీరులకుటుంబాలకు 250 గజాలస్థలం ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.ఇచ్చినహామీని అమలు చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు జక్కులమల్లయ్య, కోలపూడి యోహాన్, దారబాబురావు, సోమగాని నర్సింహ, జాన్‌సైదా, ఎండి ఖాజామోయినుద్దీన్, బెంజమాన్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
యాదాద్రి భువనగిరి
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

3 రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మోటకొండూర్

మండలంలోని పలు గ్రామాలలో రేపటి నుండి 3 రోజుల పాటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కారణంగా ఈ నెల 22న దిలావర్పూర్, ఇక్కుర్తి చాడ, తేరియాల, మరియు మాటూరు గ్రామాలలో.. 23న వట్టిపారు, దుర్సాగానిపల్లి, రాయికుంటపల్లి, మేడికుంటపల్లి, నాంచారిపేట, కదిరేణి గూడెం, చందాపూర్, షామాపూర్, గొలనుకొండ మరియు అమనబోలు గ్రామాలలో.. 24న చోళ్లేరు, ఆరెగూడెం, గిరిబోయినగూడెం, మహబూబ్ పేట, మోటకొండరుటౌన్, కాటేపల్లి, చందేపల్లి మరియు కొండాపూర్ గ్రామాలలో ఉదయం 8 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు విద్యుత్తు నిలిపివేయనున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించాలి



నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించాలని లబ్ధిదారులు సోమవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు లబ్ధిదారులను ఎంపిక చేసిందని అన్నారు. లబ్ధిదారుల ఇండ్లకు కనీస మౌలిక సదుపాయాలు లేవని మంచినీటి, విద్యుత్, రోడ్లు లేవని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు చేకూరి సుధాకర్, కొత్త సత్యం, రచ్చ సాయి, పొన్నాల హరికృష్ణ, సామల శ్రీనివాస్, బొమ్మిడి ప్రవీణ్, శ్రీదేవి, మంజుల, శ్రీలత, ఆశ, బరిగెల శంకర్, శివ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగే



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంత కే జెండగే సెక్టార్ ఆఫీసర్లకు, టీములకు సూచించారు. సోమవారం కలెక్టరేటు మీటింగ్ హాలులో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా సెక్టార్ ఆఫీసర్లకు, ఎఫ్.ఎస్.టీ, స్పెషల్ వీడియో టీమ్స్, ఎంసిసి, టీములకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ జరుగుతుందని, భువనగిరి డివిజన్ సంబంధించి 22, చౌటుప్పల్ డివిజన్ సంబంధించి 15 కలిపి మొత్తం 37 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించబడుతుందని, భువనగిరి, చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. భువనగిరి డివిజన్ సంబంధించి 7784 మంది స్త్రీలు, 12421 మంది పురుషులు, చౌటుప్పల్ డివిజన్ సంబంధించి 5458 మంది స్త్రీలు, 8417 మంది పురుషులు కలిసి మొత్తం 34,080 మంది పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మొత్తం 12 మంది సెక్టార్ ఆఫీసర్స్, 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, 17 స్పెషల్ వీడియో టీములు, 17 ఎంసిసి టీములు పర్యవేక్షిస్తాయని తెలియచేస్తూ ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉండేలా సెక్టార్ ఆఫీసర్లు చూడాలని, బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ఓటర్లకు పోల్ స్లిప్స్ పంపిణీ పూర్తి అయ్యేలా చూడాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు పోలింగ్ మెటీరియల్ సకాలంలో వెళ్లేలా, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి పోల్ అయిన మెటీరియల్ రిసెప్షన్ సెంటర్ కు చేరుకునేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ విధులు నిర్వహిస్తారని, పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని, పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా, ఉల్లంఘనలు జరుగకుండా చూడాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలు తెలుపాలని, సాయంత్రం పోలింగ్ సమయం ముగిసే 4.00 గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన వారందరూ ఓటు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలపై, బహుమతులు, కానుకలు, నగదు, మద్యం పంపిణీపై నిఘా టీములు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 లోని అన్ని నిబంధనలను పాటించాలని తెలిపారు. ఎం.ఎల్.సి. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 52 మంది పోటీ చేస్తున్న ఈ ఎన్నికలో జంబో బ్యాలెట్ బాక్సు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి , హరినాథ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్ పాల్గొన్నారు.



నేనున్నాను.. మీ పిల్లలందర్ని చదివిస్తా

- భర్తను కోల్పోయిన మహిళకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. మార్గమధ్యలో కార్యకర్తల అభ్యర్థన మేరకు భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డులో వివేరా హెూటల్ దగ్గర సోమవారం ఆగారు. కార్యకర్తలతో మాట్లాడి బయటకు వస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ముగ్గురు పిల్లలతో దీనంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలం, ఆరేగూడెం గ్రామానికి చెందిన మమత అనే మహిళను చూసి ఏ ఊరమ్మా అంటూ అడిగారు. మంత్రి పలకరింపుతో దుఃఖాన్ని దిగమింగుకుంటూ తన భర్త హర్ట్ స్ట్రోక్‌తో చనిపోయాడని, ముగ్గురు పిల్లల్ని చదవించడం, కుటుంబాన్ని పోషించడం ఇబ్బందిగా మారిందంటూ తన దీనగాథను మొత్తం మంత్రికి వివరించింది. చలించిపోయిన మంత్రి పిల్లలను ఎంత చదివితే అంతవరకు తానే చదివిస్తానని, ప్రస్తుతం కుటుంబ పోషణ కోసం ఆర్థిక భరోసా కల్పించారు. మంత్రి సాయంతో భావోద్వేగానికిగురైన మమత ఆ దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలంటూ చేతులెత్తి వేడుకుంది. ఏదో ప్రభుత్వ సాయం కోసం అడుగుదామని వస్తే.. మా జీవితాలను మార్చివేశాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనరసింహ రెడ్డి, పైల్ల సోమిరెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మెంట నగేష్,గొలుసుల శ్రీను పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన కంతుల శంకర్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డిని ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కంతుల శంకర్ హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నహాక సమావేశం పురస్కరించుకొని ఆలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ పట్టభద్రులు ఓటర్ల ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల హేమేందర్ రెడ్డికి పట్ట బద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించేందుకు కృషి చేయాలని యువమోర్చా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారని తెలిపారు.

కార్మికశాఖ పథకాలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-భువనగిరి

కార్మికశాఖ ద్వారా పొందే ప్రభుత్వ పథకాలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని భువనగిరి న్యాయ సహాయ, ఉచిత సలహా మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఎస్. జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది జి. శంకర్ కోరారు. భువనగిరిలోని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు వారికిగల చట్టపరమైన హక్కులు, కార్మిక శాఖ ద్వారా పొందె పథకాల లబ్ధిపై అవగాహన కల్పించారు. కార్మిక శాఖ నుండి గుర్తింపు కార్డు విధిగా పొందాలని తద్వారా అర్హతను బట్టి లబ్ధి పొందవచ్చని తెలిపి న్యాయ సేవల కరపత్రాలను అందరికి పంచారు. వారితో ముఖాముఖి అయ్యి వారికి న్యాయ సలహాలు అందించారు. న్యాయ సహాయం మరియు ఉచిత న్యాయ సలహాలకై ఉచిత న్యాయ సహాయ కార్యాలయం మరియు ఆయా కోర్టులలో ఏర్పాటైన న్యాయ సేవ సంస్థల నుండి పొందవచ్చని జూన్ నెల 8వ తారీఖున జాతీయ లోక్ అదాలత్ అన్ని కోర్టుల ప్రాంగణములో నిర్వహించబడుతాయని ఇట్టి లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగు కేసులు పరిష్కరించుకొవచ్చని తెలిపారు.

ఘనంగా ఇటికాల చిరంజీవి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అడ్డగూడూర్

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటికాల కృష్ణ, ఇటికాల యాదగిరి, ఇటికాల గంగులు, బల్లిక వెంకన్న, ఇటికాల సుధాకర్ గ్రామ శాఖ అధ్యక్షులు, ఇటికాల లింగయ్య, మిరియాల అంజయ్య , యాదయ్య రాజు, కడారి లింగయ్య, ఇటికాల మొగిలయ్య, ఇటికాల సంజీవ, గొలుసుల శేఖర్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుపైనే పార్కింగ్.. వాహనదారుల ఇక్కట్లు

- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే ప్రదేశం భువనగిరి బస్టాండు (ప్రభుత్వ జూనియర్ కళాశాల) మూలమలుపు నుంచి జగదేకపూర్ చౌరస్తా వరకు అత్యంత రద్దీగా ఉంటుంది. రోజూ సాయంత్రం వేళలో కార్లు, ఇతర వాహనాలు రోడ్డుపైన నిలపడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు హెల్మెట్ లేదని, లైసెన్స్ లేదని, జరిమానా విధించే ట్రాఫిక్ పోలీసులు.. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న రోడ్డుపై వాహనాలు నిలిపినా పట్టించుకోకపోవడంపై వాహనదారుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఎస్బిహెచ్ ఉన్న (స్మార్ట్ సూపర్ స్టోర్) ప్రిన్స్ కార్నర్ మధ్యలో ప్రతిరోజు రోడ్డుపైన వాహనాలు నిలపడంతో హైదరాబాద్‌కి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు సృష్టి సాధించి ట్రాఫిక్ క్లియర్ చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

మార్కెట్లో పోసిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి రైతులు అధైర్యపడవద్దని భరోసాను కల్పించారు. సోమవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఆయా గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదన్నారు. భువనగిరి నియోజకవర్గంలో వలిగొండ బీబీనగర్ మండలాల్లో కొంత దాన్యం మిగిలి ఉందన్నారు. పోచంపల్లిలో ధాన్యం ఎక్కువగా మార్కెట్లో ఉండడం అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని అన్నారు. అధికారులు వీలైనంత తొందరలో కొనుగోలును వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పోచంపల్లి మండలంలో 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, సుమారు 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లలో ఉన్నదన్నారు. వాటిని త్వరలో కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వలిగొండ మండలంలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, సుమారు 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లో ఉందన్నారు. బీబీనగర్ మండలంలో సుమారు ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లో ఉందన్నారు. ఈ సారి ఎలక్షన్లు రావడం వల్ల క్షేత్రస్థాయిలో అధికారులు కొనుగోలు కేంద్రాలపై దృష్టి సాధించకపోవడం వల్ల మార్కెట్లలో ధాన్యం నిలువలు పెరిగిపోయాయన్నారు. ఇంకో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అవుతాయని తెలిపారు. లారీల సమస్య తలెత్తకుండా లారీలను త్వరగా పంపాలని కొనుగోలును వేగవంతం చేయాలని అధికారులతో,రైస్ మిల్లు యజమానులతో మాట్లాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

- సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు గంగుల వెంకట రాజారెడ్డి



నవతెలంగాణ-రామన్నపేట

ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు గంగుల వెంకట రాజారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన చట్టసభల్లో తీన్మార్ మల్లన్న ప్రజా గొంతుకై ఉద్యమిస్తారని ఆయన అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 46 వల్ల తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని గ్రహించిన మల్లన్న ఆనాడే ప్రభుత్వం జీవో 46ను రద్దు చేసేలా ఉద్యమించారని ఆయన గుర్తు చేశారు. గతంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో గత ప్రభుత్వం కుట్రలు చేసి తీన్మార్ మల్లన్నను ఓడించిందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు ఎండి అక్రమ్, నోముల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



ప్రభాకర్, వసంత దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మాజీ జెడ్పీటీసీ జీనుకల వసంత ప్రభాకర్ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభాకర్ ఇంటికి వెళ్లి దంపతుల మెడలో గజమాలను వేసి, కేక్ కట్ చేయించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పూస బాలమణి బాలనరసింహ, మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పున్న రమేష్, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్, ఎంపీటీసీ ఎండీ రెహాన్, సేవాదళ్ అధ్యక్షులు మోటే రమేష్, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, బత్తుల కృష్ణగౌడ్, ఆకవరపు మధుబాబు, గుత్త నరసింహారెడ్డి, జేల్లా వెంకటేష్, గాదె శోభారాణి, గోగు సత్యనారాయణ, ఎండి అక్రమ్, రామిణి రమేష్, వనం బిక్షపతి, కొండ బుచ్చిబాబు, బొడ్డు శంకరయ్య, చిల్లర కైలాసం, అస్లాం బేగ్, గురుకు శివ, కోట సుధాకర్, బండమీది స్వామి, పోలు వెంకట్ రెడ్డి, సాల్వేరు లింగం, ప్రవీణ్, పాండురంగాచారి, బషీర్ బేగ్, మాంద్ర నరేష్, ఎండి నాసర్, గొలుసుల ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని దిగుమతి చేసుకోలేం

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్త వెంకటేష్



నవతెలంగాణ-భువనగిరి

ధాన్యము దిగుమతికి స్థలం లేనందున ధాన్యము దిగుమతి చేసుకోలేకపోతున్నామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్త వెంకటేష్ ప్రధాన కార్యదర్శి కోట మల్లారెడ్డిలో తెలిపారు. వారు ఒక ప్రకటన విడుదల చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం మిల్లులు 39 బాయిల్డ్ రైస్ మిల్లులు కలవు. మా యొక్క మిల్లులలో రబీ 2022-23 కు సంబందించి సుమారుగా 1,80,000 టన్నుల ధాన్యం మరియు ఖరీఫ్ 2023- 24 కు సంబందించి సుమారుగా 1,40,000 టన్నుల ధాన్యం నిల్వ వున్నది. మాకు కేటాయించినటువంటి రబి 2023-24 కి సంబందించిన ధాన్యం సుమారుగా 2,20,000 టన్నుల ధాన్యం దిగుమతి చేసుకున్నాము. ప్రస్తుతం మాయొక్క మిల్లులలో సుమారుగా 5,40,000 టన్నుల ధాన్యం నిల్వ వున్నది. జిల్లాలో గల 39 బాయిల్డ్ రైస్ మిల్లుల ధాన్యం నిల్వ కెపాసిటీ సుమారు 3,00,000 టన్నులు మాత్రమే. మిగతా 2,40,000 టన్నుల ధాన్యం మా యొక్క మిల్లు ఆవరణలలో, ప్రభుత్వ ప్రైవేట్ గోదాములలో నిల్వ వున్నవి. మా యొక్క మిల్లుల వద్ద ఇంకను దిగుమతి చేసుకోవలసిన లారీలు ధాన్యం సుమారుగా 10,000 టన్నుల ధాన్యం కలదు. అట్టి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం వారి ఆదేశముల మేరకు మేము దిగుమతి చేసుకోగలమన్నారు. ప్రస్తుతం మావద్ద ధాన్యం దిగుమతికి స్థలం లేనందున మేము ధాన్యం దిగుమతి చేసుకోలేకపోతున్నామన్నారు. కోశాధికారి గౌరిశెట్టి అశోక్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వినతి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడం వలన వర్షాలు పడి తీవ్రంగా నష్టపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఏ గ్రేడ్ రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చెయ్యాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు చొక్కా రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి వల్దాస్ రాజ్ కాళభైరవ, రాములు, భువనగిరి మండల అధ్యక్షుడు సురేష్ రెడ్డి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు మానిక్యం రెడ్డి , పట్నం కిట్టు, దిలీప్, వెంకటేష్,నరెందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉత్తమ ఫలితాలు

- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే పాఠశాలకు తల్లిదండ్రులకు పట్టణానికి మంచి గుర్తింపు లభిస్తుందని కేవిటి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు కర్నాటి బాలసుబ్రమణ్యం అన్నారు. సోమవారం కేవీటి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన 2023-24 విద్యా సంవత్సరంలో 10/10 సాధించిన గౌతమి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించి నగదు పారితోషకం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో కెవిటి సభ్యులు క్రమశిక్షణ ఐక్యమత్యము నిదర్శనమని కేవిటి క్లబ్ అధ్యక్షులు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం అన్నారు. గతంలో కూడా పేద ప్రజలకు నిత్యవసర సరుకులతో పాటు నగదు అందజేశామన్నారు. అలాగే కేవీటీ కర్నాటి వెంకటేశం 57వ జయంతి పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్పోర్ట్స్ క్లబ్ స్థాపించి 35 సంవత్సరాలు సుదీర్ఘంగా ఎంతోమంది పేదలకు సహాయం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమాశంకర్ రాజు రమేష్ కృష్ణకుమార్ టి యాదగిరి నరేష్ గౌతమి స్కూల్ కృష్ణవేణి స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు

నవతెలంగాణ యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను స్వస్తివచనంతో సోమవారం ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య ఆరాదన పుణ్యవచనం నిర్వహించి లక్ష కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. తదుపరి లక్ష్మీనరసింహస్వామి వారిని తిరువెంకటపతిగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు అర్చకులు పేద పండితులు పారాయణికులు అత్యంత వైభవంగా ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో నిత్య సామూహిక పారాయణ అనంతరం వేదమంత్రోత్సవాల మధ్య అంకురార్పణ హవనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి, ఈవో భాస్కరరావు అధికారులు పాల్గొన్నారు.

రేపటినుండి నూతన బస్ సర్వీస్

నవతెలంగాణ-రాజపేట

రేపటి(బుధవారం) నుండి మండలంలో నూతన బస్ సర్వీస్ ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. సిద్దిపేట మధ్యాహ్నం 2:30 బయలుదేరి 3:30కి కొమురవెల్లికి చేరుకుంటుంది. రాజాపేట 4:30కి బయలుదేరి జగదేవ్ పూర్ 5:00 చేరుకుంటుంది. సికింద్రాబాద్ స్టేషన్ సాయంత్రం 6:00 చేరుకుంటుంది. తిరిగి యాదవిగా రూట్లో కొమురవెల్లి నైట్ హల్ ఉదయం 5:00కి కొమురవెల్లి నుండి బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్ 7:30 చేరుకుంటుంది. తిరిగి 8:00 సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి ఈసిఐఎల్, జగదేవ్ పూర్, రాజాపేట, పాముకుంట, సింగారం సాల్వాపూర్ నాగపురి రాంసాగర్ కొమురవెల్లి సిద్దిపేట 11:30 డిపోకు చేరుకుంటుంది.

మృతుల కుటుంబాలకు సాయం అందజేత

నవతెలంగాణ-రాజపేట



మండలంలోని పారుపల్లి గ్రామంలో బొమ్మగాని అండమ్మ, గౌర వెంకయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు రాపోలు లక్ష్మారెడ్డి ఒక్కొక్కరికి యాభై కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు మోటే బాల మల్లేశం, కాలే నరసింహులు, సీతాల వీరయ్య, బిక్షపతి, కపిల్, జూకంటి వీరయ్య, బొమ్మగాని నరసింహులు, సీతల వీరయ్య, గౌర బక్కయ్య, ఫొటో కుమార్, నర్సింలు పాల్గొన్నారు.

అందుబాటులో లేని పోస్టాఫీస్ సేవలు

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

నవతెలంగాణ -వేములపల్లి



బ్యాంకింగ్ వ్యవస్థలు పోటీపడుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీస్ సేవలను బలోపేతం చేయాలని దృఢ సంకల్పంతో నియమ నిబంధనలను ఏర్పాటు చేసి ప్రజలకు చేరువుగా ఉండాలని సేవలు అందించాలని ప్రయత్నం చేస్తుంటే స్థానికంగా మండల కేంద్రాల్లో పనిచేస్తున్న పోస్ట్ ఆఫీస్ సిబ్బంది వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్ మాస్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పోస్ట్ ఆఫీస్ పరిధిలోని ప్రజలు వాపోయారు .మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించగా పోస్ట్ ఆఫీస్ మూతపడి ఉంది. కార్యాలయం మూతపడ్డ విషయమై అధికారులకు ఫోన్ చేసినప్పటికీ స్పందన లేదు. కార్యాలయానికి మూతపడి ఉండడంతో వినియోగదారులు వచ్చి పోతున్నారు. సోమవారం కావడం వల్ల లావాదేవీల కోసం వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై స్థానికంగా ఉన్న సంబంధిత అధికారులు ఆరా తీయాలన్నా ఫోన్ అందుబాటులో లేదు. గంట అనంతరం సిబ్బంది రావడంతో ఫోన్ నెంబర్తో విచారించగా అధికారి నెంబర్ లేదని సమాధానం ఇచ్చారు. కార్యాలయంలో ఉన్న నెంబర్ ని ఆరా తీయగా క్యాష్ కోసం పోయినట్లు పోస్ట్ ఆఫీసర్ సమాచారం ఇచ్చారు. కార్యాలయంలో పోస్ట్ ఆఫీసర్ పై వినియోగదారులు తీవ్ర ఆరోపణలు చేశారు.పోస్ట్ ఆఫీస్ లో సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, డిపాజిట్లు చేస్తామని వినియోగదారులు వస్తే సర్వర్ బిజీగా ఉందని సమాధానం చెబుతున్నారని వాపోయారు .అకౌంట్లు ఓపెన్ చేస్తామని వచ్చిన వినియోగదారులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు పుస్తకాలు అందజేయట్లేదని వినియోగదారులు ఆవేదనవెలిబుచ్చారు. ఉపాధి హామీ కూలీలకు డబ్బులు అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వచ్చిన వారిపై అసహనం వ్యక్తం చేస్తున్నట్లు వాపోతున్నారు. సంవత్సరము దాటిన ఉపాధి కూలీల డబ్బులు లక్షల రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో నిలవ ఉన్నాయి. పోస్ట్ ఆఫీస్ లో ఉన్న ఖాతాదారులు తమ డబ్బులు పోస్ట్ ఆఫీస్ ఖాతాలో పడ్డాయని ఆరా తీస్తే చికాకు పడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వినియోగదారులు వాపోయారు.మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ లో ఉన్నత అధికారులు చొరవ చూపి వినియోదారులకు అందుబాటులో ఉండే అధికారిని ఏర్పాటు చేయాలని, వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- నేడు జిల్లాకు కేటీఆర్ రాక

నవతెలంగాణ -నల్లగొండ టౌన్

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు గెలిచి విజయడంఖా మోగించాము..ఈ సారి కూడా విజయం మనదేనని అని మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్లసమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, మంగళవారం కేటీఆర్ జిల్లా లో నిర్వహించే ప్రచార సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశాలను విజయవంతం చేయాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసం అందరికి అర్థం అయిందని తెలిపారు.గుజరాత్ లో కూడా పేదరికం పెరిగిందని దేశం యావత్తు అంధకారం లోకి వెళ్ళిందన్నారు.ఎన్నికలప్పుడే పాకిస్తాన్ గురించి మాట్లాడుతారు ఈ బీజేపీ వాళ్ళు..బీజేపీ అసలు రంగు బయటపడిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా అట్టర్ ఫ్లాప్ అయిందని ఇక్కడ కూడా అబద్ధపు ప్రచారాలు చేస్తూ కాలం గడుపుతున్నది ఈ ప్రభుత్వం అని దుయ్యబట్టారు.రుణమాఫీ చేస్తాం అంటూ మభ్యపెడుతున్నారని అన్నారు.బీసీ గణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహిస్తాం అని చెప్పిన కాంగ్రెస్ మాట మార్చిందన్నారు.యువత ఇవి అన్ని ఆలోచన చేయాలన్నారు. యువతను నిలువునా ముంచింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. హాస్టళ్లల్లో విష ఆహారం తిని విద్యార్థులు చనిపోతున్నారని ఇంత కంటే దౌర్భాగ్యం ఇంకోటి వుంటాదా?అని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ యువత విచక్షణ తో ఓటయ్యాలన్నారు. కోమటిరెడ్డి లాంటి చిల్లర వ్యక్తి గురించి మాట్లాడటం వేస్ట్...అతను నిలకడ లేని వ్యక్తి అన్నారు.గ్రాడ్యుయేట్ ఓటర్లు ఆలోచన చేసి ఓటయ్యాలన్నారు.కేసీఆర్ గారు ఉద్యోగాలు భర్తీ చేస్తే వాటి అపాయింట్మెంట్ కాపీలను పంచుతూ రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడని పేర్కొన్నారు.బీజేపీ పార్టీ అన్ని వ్యవస్థ లను చిన్నాభిన్నం చేసింది.. కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసిందని పార్టీల అభ్యర్థులను చూసి ఓటయ్యాలని పేర్కొన్నారు.పోరాటం చేసే వారిని ప్రోత్సహించి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్,,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, నలగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,కనగల్ ఎంపీపీ కరీం పాషా, బక్క పిచ్చయ్య.. కంచనపల్లి రవీందర రావు. నల్గొండ పట్టణ పార్టీ అధ్యక్షులు,బోనగిరి దేవేందర్,సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, నల్గొండ మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు మారగోని గణేష్, వట్టిపల్లి శ్రీనివాస్, మెరుగు గోపి,పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, సుంకి రెడ్డి వెంకట్ రెడ్డి బడుపుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలి



- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

విద్యార్థులు చిన్నప్పటినుండి కష్టపడి చదివి మంచి ప్రతిభ సాధించి భవిష్యత్తులో సమాజంలో ఉన్నత స్థానం పొందాలని ,ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాలలో ఉంటూ కష్టపడి చదివి పదవ తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్లలో ఉంటూ కష్టపడి చదివి పదికి పది జీపీఎ సాధించడం సంతోషకరమని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు సైతం బాగా చదివి మంచి మార్కులు పొందాలని కోరారు. 10 జీపీఏ సాధించిన వారిలో గిరిజన సంక్షేమ హాస్టల్ లో చదివిన రమావత్ సర్దార్, పాల్య సహారా(బాలిక), వడ్త్యా అరవింద్, ఎస్సి సంక్షేమ హాస్టల్లో చదివిన ఇరాపురి అక్షర, చలమల పుష్కరిణి, అయేషా అంజుమ్ లు ఉన్నారు. కరోనా సమయంలో అకాల మరణం చెందిన మునుగోడు తహసిల్దార్ సునంద పేరు మీద తన భర్త లక్ష్మారెడ్డి 10 జీపీఏ సాధించిన ముగ్గురు ఎస్సీ సంక్షేమ విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిమెంట్ వ్యాపారస్తులపై దాడులు

- 12 మందిపై కేసు నమోదు

నవతెలంగాణ -నల్లగొండ టౌన్



లీగల్ మెట్రోలజీ శాఖ ప్రపంచ మెట్రోలజీ డే సందర్భంగా సోమవారం నల్గొండ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్ధార్థ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలోని దేవరకొండ కొండమల్లేపల్లి లోగల పలు పెట్రోల్ బంకులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి వినియోగదారులకు అవగాహనకల్పించారు. నల్గొండ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ పట్టణంలోని పలు దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఐరన్ హార్డ్వేర్ ,సిమెంట్ వ్యాపారస్తులపై ప్యాకేజింగ్ రూల్స్ ఉల్లంఘించినందుకు12 కేసులు నమోదుచేశారు. అంతేకాకుండా వ్యాపారస్తులు అమ్మే వస్తువులపై మ్యానుఫ్యాక్చరింగ్ అడ్రస్ రిటైల్ ప్రైస్ నెట్ క్వాంటిటీ మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ వంటి ప్యాకేజింగ్ నిబంధనలను పాటించకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.పెట్రోల్ బంక్ వ్యాపారస్తులు వినియోగదారుల కోరిక మేరకు అక్కడికక్కడే 5 లీటర్ల క్యాన్‌తో వారి సమక్షంలో డెలివరీలు చెక్ చేసి చూపించాలని తెలిపారు.

మల్లమ్మ మృతికి నివాళి

నవతెలంగాణ- నకిరేకల్



నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన దోరేపల్లి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు . అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మామ సత్తయ్య ఇటీవల మరణించగా సోమవారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కుట్టు మిషన్ల రిపేర్‌కు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆలేరు టౌన్

మండలంలోని కోలనుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుట్టు మిషన్లు రిపేర్ చేయించుటకు స్థానికులు దాతల సహకారం కోరినందున, దాతలు కోలా కృపానంద్ గౌడ్, పుట్టినరోజు సందర్భంగా కుమార్తె గడ్డమీది మిథిలా కళ్యాణ్ గౌడ్ 5 వేలు, గొట్టం విజేందర్ రెడ్డి 5 వేలు, అన్ రెడ్డి రఘుపతి రెడ్డి 5 వేలు, అమృతం బాలరాజు 5 వేలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేశారు. కొలనుపాక స్కూల్ కాంప్లెక్స్ చిన్నారులకు స్కూల్ యూనిఫామ్ తయారుకు ఆర్థిక సాయంగా అందిన డబ్బులు ఉపయోగిస్తామని, మహిళా సంఘాల అందరి పక్షాన, పిల్లల తల్లిదండ్రుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మాజీ సర్పంచ్‌కు మాతృవియోగం

నవతెలంగాణ -నకిరేకల్

మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దోరేపల్లి ఎల్లయ్య తల్లి దోరేపల్లి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కొప్పుల అంజయ్య, వెంకటయ్య, సుధీర్ ,తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నవతెలంగాణ- నకిరేకల్

మండలంలోని చందుపట్ల గ్రామంలో ఎర్ర మణికుమార్ జ్ఞాపకార్థం అతనీ స్నేహితుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేత నిలిచిన మామిడాల జట్టుకు మణికుమార్ తండ్రి ఎర్ర రమేష్ పద్మలు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఆర్గనైజర్‌టీమ్‌కు ఎర్ర నాగయ్య నీలిమ, తృతీయ స్థానంలో నిలిచిన స్నేహ యువజన మండలి జట్టుకు ఎర్ర జానయ్య ప్రసన్నలు నగదు బహుమతితో పాటు షీల్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర మణికుమార్ కుటుంబ సభ్యులు , కొత్తపల్లి ఎల్లయ్య, ఇమ్మటి నాగరాజు, కొల్లు మహేష్, వనం పరుశరాం, ఎర్ర శరత్, చింతమల్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ రావు చెరువును కబ్జాదారుల నుంచి కాపాడండి

- ఆర్డీవోకు మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఫిర్యాదు

నవతెలంగాణ- మిర్యాలగూడ



అడవి దేవులపల్లి గ్రామ పరిధిలోని భాస్కర్ రావు చెరువును పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేయించి, భూకబ్జాదారులపై చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలనిమత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సోమవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.ఆడవిదేవులపల్లి మండలం, గ్రామ పరిధిలో గల భాస్కర్ రావు చెరువు సర్వే నంబర్ 59 లో మొత్తం విస్తీర్ణం 136. 25 ఎకరాలు ఉన్నదని, చెరువు చుట్టూ మూడు ప్రక్కల గత కొంతకాలంగా కొందరు వ్యక్తులు భూకబ్జాలకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడవిదేవులపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ సభ్యులుగా రాము భూకబ్జాదారులను అడ్డుకుంటున్న సందర్భంలో ఘర్షణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అడవిదేవులపల్లి గ్రామంలోని భాస్కర రావు చెరువు విస్తీర్ణమునకు సంబంధించి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేయించి, భూ కబ్జాదారులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు చేన్న బోయిన సైదయ్య, సభ్యులు చెవిటి సైదయ్యలు కోరారు. ఈ విషయంపై నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ డిప్యూటీ ఇంజనీర్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- తహసీల్దార్ హరిబాబు



నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ, వరంగల్, ఖమ్మం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నిక ఈ నెల జరగనుండగా మిర్యాలగూడ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్.హరిబాబు సోమవారం పరిశీలించారు. మిర్యాలగూడ పట్టణంలో సుమారు 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలోని 509, 510 నెంబర్ పోలింగ్ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బకాల్వాడలోని 511, 512, 513 నెంబర్ పోలింగ్ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాళ్లగడ్డలోని 515, 516, 517 కేంద్రాలు, నాగార్జున డిగ్రీ కళాశాలలోని 518, 519 కేంద్రాలు, ఈదులగూడలోని మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలోని 520, 521కేంద్రాలను మౌలిక వసతులు పరిశీలించారు, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కల్పించిన సౌకర్యాలను కొనసాగించాలని కోరారు. అదే విధంగా ఈదులగూడ, సుందర్ నగర్, చైతన్య నగర్ లలో ఎమ్మెల్సి పోలింగ్ స్లిప్పుల పంపిణీ పరిశీలించి పంపిణీ చేశారు. ఆయన వెంట బిఎల్ఓ, అంగన్వాడీ టీచర్ బి.పార్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ లింగస్వామి

నవతెలంగాణ- చిట్యాల టౌన్



చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు (శివనేనిగూడెం) చెందిన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ గాదె లింగస్వామిని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా, ఆ ఉపాధ్యాయ సంఘం ఐక్య గురుకులాల కన్వీనర్ గా నియామిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పార్వతి సత్యనారాయణ సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ తెలంగాణ పీఆర్ టీయూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గురుకులాల ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యల, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానన్నారు. తన నియామాకానికి సహకరించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మణిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సదరం స్లాట్ బుకింగ్ పై సీఎం నిర్ణయం అభినందనీయం

- పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ పాండురంగారావు

నవతెలంగాణ -చింతపల్లి



రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు సదరం సర్టిఫికెట్ కోసం గతంలో స్లాట్ బుకింగ్ కోసం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న సదరం స్లాట్ బుకింగ్ పై ఒక నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమని పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ పాండురంగారావు, వికలాంగుల జిల్లా అధ్యక్షులు జెల్లా నరసింహ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకటేశ్వర నగర్ మాల్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వికలాంగుల సమస్యలను స్లాట్ బుకింగ్ ప్రతినెల ఒకసారి మాత్రమే రావడం వల్ల వికలాంగులు బుకింగ్ చేసుకోవడానికి వెళ్తే ఒక గంట సేపట్లో సర్వర్ క్లోజ్ కావడం వారిని తీవ్ర ఇబ్బందికి గురిచేసింది విషయాన్ని గమనించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి స్లాట్ బుకింగ్ ఎప్పుడైనా చేసుకోవచ్చని అలాంటి వెసులుబాటు ప్రభుత్వం కల్పిస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం అభినందనీయమని వారన్నారు. గ్రామాలలో ఉన్నటువంటి అర్హత కలిగిన వికలాంగులను గుర్తించి మండల స్థాయిలో సదరం క్యాంపులు కూడా నిర్వహించాలని సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఏదేమైనప్పటికీ వికలాంగుల పైన రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వికలాంగుల పక్షాన ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతూ, పెంచిన పింఛన్లు కూడా తక్షణమే అందించాలని కోరారు.



ఉపాధి కూలీలకు రోజుకు 600 వేతనమివ్వాలి

నవ తెలంగాణ- కేతపల్లి

పెరుగుతున్నదారులకు అనుగుణంగా ఉపాధి కూలీలకు ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ లూర్దు మారయ్య అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరుగుతున్నటువంటి వస్తువుల ధరలు గ్యాస్ వంటనూనెలు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి అని చెప్పారు.ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి బతుకు దుర్భరం అవుతున్నది అని చెప్పారు.వ్యవసాయ కూలీల జీవనం దినదిన గండంగా మారింది అందుకే పెరుగుతున్న ధరల దృష్ట్యా ఉపాధి కూలీల వేతనం రోజుకు 600 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకొస్తే ఉపాధి హామీ చట్టం రద్దును చేపడుతుందది తెలిపారు.కేంద్రంలో అధికారం లో ఉన్న మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి కేంద్ర బడ్జెట్లో నిధులు కుదిస్తూ చట్టాన్ని నీరుగారిచే పద్ధతుల్లో వ్య వరిస్తూ ఉపాధి హామీ చట్టం లేకుండా చేయడం కోసం అనేక మార్పులు చేర్పులు ఉపాధి హామీలో తీసుకురావడం జరిగిందని తెలియజేశారు .కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించడం మూలంగా ఉపాధి కార్మికులు పనిచేసిన వాటికి పెద్ద ఎత్తున బకాయిలు పేరుకు పోయాయని గత సంవత్సరం తో పాటు ఈ సంవత్సరం పనిచేసిన కార్మికులకు బిల్లులు రాకపోవడం మూలంగా కూలీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చౌగొని నాగయ్య వీరబోయిన చౌడయ్య జట్టంగి వెంకన్న లింగయ్య సావనమ్మ మట్టే బాలయ్య మారగోని మల్లయ్య జానయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

'ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేయాలి'

నవతెలంగాణ- చండూరు



ఖమ్మం, వరంగల్లు, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా చండూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పట్ట బద్రులకు బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరుతూ బీజేపీ శ్రేణులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం, ధర్మం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమా నర్సింహా, రాష్ట్ర ఓ బి సి అధికార ప్రతినిధి కోమటి వీరేశం,పట్టణ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు, బీజేపీ జిల్లా నాయకులు బూతరాజు శ్రీహరి, మాదగోని స్వామి,సోమా శంకర్ సీనియర్ నాయకులు తడకమళ్ల శ్రీధర్, మాజీ ఎంపీటీసీ రవిరాల శ్రీను, ప్రధాన కార్యదర్శి బొబ్బల శివ, బూతరాజు స్వామి, గండు శ్రీకాంత్, పెద్దబోయిన శంకర్, గన్నవరం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి

మంగళవారం | మే 21. 2024 | www.navatelangana.com

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది మైలారం సుగుణ భర్త చిట్టయ్య కుటుంబాన్ని మాజీ సర్పంచ్ సునావత్ అశోక్ నాయక్ సోమవారం పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన మూడు మృతుల కుటుంబాలకు 15 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ నాయక్, పలువురు కుటుంబ సభ్యులు యువకులు ఉన్నారు.

బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ- చండూరు



మున్సిపల్ కేంద్రంలోని 6వ వార్డు కు చెందిన నిరుపేద మహిళ రాపోలు సాంబమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న గాంధీజీ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు వారి కుటుంబానికి 50కేజీ ల బియ్యం, కిరాణా సామాను సోమవారం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పున్న బిక్షమయ్య, రావిరాల రాజేంద్రప్రసాద్, తిరందాసు నందు, ఏలె సుధాకర్, సరికొండ వెంకన్న, రుద్ర యాదగిరి, గుర్రం అంజయ్య జూలూరు వెంకటేశ్వర్లు, సంగిశెట్టి సాయి, బోడ విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో మెరుగైన స్థానంలో నల్లగొండ జిల్లా

- కలెక్టర్ హరిచందన దాసరి
- జిల్లాకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్
- అసిస్టెంట్ సెక్షన్ అధికారులు
- వారితో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



నల్గొండ జిల్లాలో ఇంటింటికి తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, సెగ్రిగేషన్ షెడ్లనిర్వహణ, ఉపాధి హామీ అమలు వంటి పథకాలలో మెరుగైన స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్ కి చెందిన 26 మంది అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం శిక్షణ కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లాలో ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయన నిమిత్తం జిల్లాకు రాగా, సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ వారితో ముఖాముఖి మాట్లాడారు. నల్గొండ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని, పట్టణ ప్రాంతాలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాలలో సైతం నల్ల కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో చెత్తను వేరు చేసే షెడ్ల నిర్మాణాన్ని చేపట్టామని, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి ఊరి బయట సెగ్రిగేషన్ షెడ్ ద్వారా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తున్నట్లు వారికి తెలియజేశారు.వ్యవసాయంలో భాగంగా విత్తనాల సరఫరా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందించే విధానాన్ని వివరించారు.విద్యకు సంబంధించి పాఠశాల స్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీల ద్వారా పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఉపాధి హామీ కింద జియో ట్యాగింగ్ ద్వారా పనుల గుర్తింపు, మస్టర్ నమోదు అన్నింటిని ఆన్లైన్లో పరిశీలించుకోవచ్చని, నూటికి నూరు శాతం డిజిటలైజేషన్ చేసినట్టు తెలిపారు.

24 వరకు జిల్లాలు పర్యటన..

కాగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఏప్రిల్ 8 నుండి జూన్ 7 వరకు హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ నిమిత్తం రాగా, నల్గొండ జిల్లా లో ప్రజల జీవన పరిస్థితుల అధ్యయనం నిమిత్తం ఈనెల 20 నుండి 24 వరకు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాలలో పర్యటించనున్నారు. నల్గొండ మండలం అన్నె పర్తి, మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్, దామరచర్ల మండలం వాడపల్లి, చిట్యాల మండలం ఊరుమడ్ల, మునుగోడు మండలం పలివేల గ్రామాలలో అక్కడి ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు అక్కడే బస చేయనున్నారు. కాగా ఈ బృందానికి నోడల్ అధికారిగా డిఆర్డిఓ నాగిరెడ్డి వ్యవహరించనున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

అనంతరం ఈ బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికలు, శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రాన్ని సందర్శించగా, ఎంసిఎంసి నోడల్ అధికారి సమాచార సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు వారికి ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి విధులు, బాధ్యతలను తెలియజేశారు.



తీన్మార్ మల్లన్నను మెజారిటీతో గెలిపించుకోవాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-భువనగిరి

నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైయస్సార్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తీన్మార్ మల్లన్న స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన స్థానికుడని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని పట్టభద్రులను కోరారు. మల్లన్న గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు ముందుకు పోవాలన్నారు. మండలాల వారిగా పట్టభద్రుల లిస్టులు తయారు చేశామని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలోపే హామీలు నెరవేర్చామని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కి గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టులో రైతులకు రెండు లక్షల రుణమాఫీ సిఎం రేవంత్ రెడ్డి చేయనున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం అన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేశారని 20వేల మెజారిటీ వస్తుందన్నారు. 2017లో మల్లన్న పోటీ చేస్తే నేను ప్రతి మండలం తిరిగి ప్రచారం చేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ రవి కుమార్, కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్ కుమార్, మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, ఎంపీపీ నిర్మల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టడంలో డీలర్లు సహకరించాలి



- జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగే

నవతెలంగాణ-భువనగిరి

నకిలీ విత్తనాలను అరికట్టడంలో డీలర్లు సహకరించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు హనుమంతు కే జెండగే తెలిపారు. సోమవారం కలెక్టరేటు సమావేశ హాలులో ఆయన డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్రతో కలిసి జిల్లాలోని విత్తన డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీలర్లతో మాట్లాడుతూ విత్తన డీలర్లు రాబోయే వానకాలం సీజన్ సంబంధించి రైతాంగానికి నాణ్యతతో కూడిన వితనాలు అమ్మాలని, రైతులు నష్టపోకుండా, నకిలీ విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలన్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్లలోనికి రాకుండా నివారించేందుకు నాలుగు మండలాలకు ఒకటి చొప్పున 4 టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి టీములో ఒక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఇద్దరు పోలీసు అధికారులు ఉంటారని తెలిపారు. హెచ్‌టి కాటన్ (కలుపు మందును తట్టుకునే ఒక రకం) విత్తనాలకు మన దేశంలో అనుమతి లేదని, అమ్మితే పిడి యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని, అలాగే లూజ్ విత్తనాలు, ఎక్స్పైరీ దాటిన విత్తనాలు అమ్మినా చర్యలు ఉంటాయని తెలిపారు. డీలర్లు తమ షాపులలో రిజిష్టర్లు, బిల్స్ సరిగా నిర్వహించాలని, నిఘా బృందాలకు చూపించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులు అమ్మాలని, ఇ-పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరుగాలని సూచించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నకిలీ విత్తనాల పట్ల కలిగే నష్టాలపై, మేలురకం బ్రాండెడ్ విత్తనాల ద్వారా వచ్చే లాభాలను వివరించాలని, వ్యవసాయ అధికారులు జర్మినేషన్ వస్తుందా లేదా తెలుసుకోవడానికి నాణ్యతా పరీక్షల కోసం విత్తన శాంపుల్స్ హైదరాబాదు రాజేంద్రనగర్ విత్తన పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు.

అనంతరం డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ డీలర్లందరూ వ్యవసాయ, పోలీస్ శాఖలకు సహకరించి రైతులకు మేలు చేయాలని అన్నారు. ముఖ్యంగా చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని, విత్తనాలు అక్రమంగా స్టోర్ చేసినా, రవాణా చేసినా, లూజుగా అమ్మినా జరిమానాతో పాటు శిక్షకు కూడా గురికావాల్సి వస్తుందన్నారు. ప్రతి ఏడాది రాచకొండ పరిధిలో రైతులను మోసం చేస్తున్న వారిపై పిడి యాక్ట్ ద్వారా శిక్షించడం జరిగిందని, నకిలీ విత్తనాలపై నిఘా పెట్టడం జరిగిందని తెలిపారు. ఎవరైనా రైతులను మోసం చేస్తున్న విషయం తెలిస్తే పోలీస్ శాఖకు టోల్ ఫ్రీ ద్వారా తెలుపాలని, తద్వారా రైతులకు మేలు చేసిన వారవుతారని డీలర్లను కోరారు. సీడ్ సరిగా లేక రైతులకు పంట దిగుబడి సరిగా రాకపోతే కూడా పంట పరిశీలించి అమ్మిన వారిపై చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని, డీలర్లు అందరూ ప్రభుత్వం సూచించిన బ్రాండెడ్ విత్తనాలని అమ్మాలని, రైతు క్షేమం కోసం అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలోని నేషనల్ హైవేలపై నకిలీ విత్తన రవాణా జరుగకుండా నిఘా పెట్టడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు దేవీసింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ, జిల్లా విత్తన డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు బజ్జూరి రవి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



దళితులను మోసగిస్తున్న బీజేపీ

నవతెలంగాణ-సూర్యాపేట

దళితులను మోసం చేసిన పార్టీ బీజేపీ అని ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి ఆరోపించారు.సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠలో మోడీ తప్పులు చేశారని, ఈ తప్పులను ఆ రాముడు కూడా క్షమించడని తెలిపారు. దేశంలో మోడీ శకం ముగిసిందన్నారు.జూన్ 4వ తేదీన ఎర్రకోటలో రాహుల్‌గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపడుతారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)ను అత్యధిక మెజార్టీతో పట్టభద్రులు గెలిపించాలన్నారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని, దేశంలో బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తండు శ్రీనివాస్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు అంజద్అలీ, కోడి శ్రీను,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సీటు సాధించిన విద్యార్థిని

నవతెలంగాణ-తిరుమలగిరి



రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రకటించిన మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫలితాలలో గుండెపురి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిడి.మనీషా కు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం కడ్తాల్ కళాశాలలో బైపీసీ ఫస్టియర్‌లో సీటు సాధించింది.ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోడేసి.రామారావు, ఉపాధ్యాయులు సున్నపోజు సోమయ్య,బి.లక్ష్మణ్‌నాయక్, జీ.ఆనందభాస్కర్, స్వరూపరాణి, మహేష్, రవినాయక్ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఈ విజయం సాధించామని తెలిపారు.

కష్టపడి చదివితే భవిష్యత్ అంతా బంగారుమయం

- జీఎస్టీ సీటీఓ నాగేందర్

నవతెలంగాణ-కోదాడరూరల్



విద్యార్థులు గట్టిసంకల్పంతో ఐదు ఆరు సంవత్సరాలు బాగా కష్టపడితే భవిష్యత్ అంతా బంగారమయం అవుతుందని జీఎస్టీ సీటీఓ నాగేందర్ అన్నారు.సోమవారం పట్టణంలోని ఎమ్మెస్ కళాశాలలో 45 రోజుల నుండి అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న పాలిసెట్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు పోటీ పరీక్షలలో ఎలా ముందంజలో ఉండాలి అనే అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.విద్యార్థులకు పలు విలువైన సూచనలు చేశారు.ఎంట్రన్స్ టెస్ట్‌కు వెళ్లే పిల్లలు భయాందోళనకు గురికాకుండా మనోధైర్యంతో వెళ్లి ఎంట్రన్స్‌ను చక్కగా రాసి ఉచితంగా విద్యను అందించిన ఆస్క్ సంస్థకు, మీ తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.అనంతరం తెలంగాణవాణిజ్యపన్నుల శాఖ ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్‌తరపున ఆస్క్ సంస్థకు కొంత ఆర్థికసాయం అందజేశారు.ఆస్క్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు.ఆయనతో పాటు జీఎస్టీ ఏసీటీఓ రవీందర్‌బాబును సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆస్క్ అధ్యక్షులు బలుగూరి స్నేహ దుర్గయ్య,ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్‌రావు, కోర్సు డైరెక్టర్‌శౌరి,ఫ్యాకల్టీ చెరుకుపల్లికిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ యుగంధర్‌పై దాడితోనే తుంగతుర్తిలో గాదరికి గుణపాఠం

నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన అవినీతితోపాటు దళితబంధు అక్రమాలను ప్రశ్నించిన అడ్వకేట్ పఱ్ఱెపాటి యుగంధర్‌పై దాడితోనే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కు ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై. నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు కందుకూరు అంబేద్కర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మున్సిపల్ పరిధిలోని తిరుమల సహకార జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.తుంగతుర్తి నియోజకవర్గంలో పదేండ్లుగా శాసనసభ్యులు గెలిచిన గాదరి కిషోర్‌కుమార్ ఇసుకమాఫియా భూదందా, ప్రశ్నించిన వారిపై దాడులు, కోట్లాది రూపాయలు అవినీతి జరిగాయన్నారు.ఆనాడు జరిగిన అవినీతిని ప్రశ్నించిన వారిపై తన అనుచరులతో దాడులతోపాటు అధికారబలంతో అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేసే వారన్నారు.తిరుమలగిరిలో దళితబంధులో జరిగిన అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకే అడ్వకేట్ యుగంధర్‌పై దాడితోపాటు హత్యాయత్నం చేశారని వారన్నారు.దీంతో నియోజకవర్గంతో పాటు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు.దీంతో ప్రజలు చైతన్యవంతమై బి ఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. అడ్వకేట్ యుగంధర్ మాట్లాడుతూ తనపై దాడి జరిగి సంవత్సరం పూర్తి అయిందని అన్నారు . తనపై దాడి జరిగిన సమయంలో నేను కనీసం బాధపడలేదని కానీ తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు అన్యాయం కాకూడదని ఉద్దేశంతోనే ఉద్యమించి గాదరి కిషోర్ కుమార్ కు తగిన గుణపాఠం చెప్పే వరకు తాను నిదురపోలేదన్నారు. ఈరోజు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోయిందన్నారు.తాను బీఆర్ఎస్ నాయకులు గాదరి కిషోర్ కుమార్ ఎక్కడ నుండి పోటీ చేసిన అక్కడ నేను తాను పోటీలో ఉండి అతని అక్రమాలను బయటపెడతానని తెలిపారు. దాడి జరిగిన సమయంలో తనకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జంపాల రాజేష్, శాగంటిరాములు, పార్టీ అనుబంధ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ,ఫత్తేపురం సుధాకర్, ఏనుగుల కొమరమల్లు, గడ్డిదిలీప్, నాయినికృష్ణ, బొంఢ వంశీ,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణా కార్యక్రమం

- శిక్షణ నోడల్ అధికారి శ్రవణ్



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

వరంగల్, ఖమ్మం,నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో నిర్వహించినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి తప్పులు జరగకుండా పోలింగ్ ను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన కోరారు. సోమవారం నిర్వహించిన మొదటి విడత పోలింగ్ శిక్షణ కార్యక్రమానికి ఎఫ్ ఎస్ టి, ఎం సి సి బృందాలు, జోనల్ ఆఫీసర్లు,పిఓ, ఏపీవోలు ఉన్నారు.కాగా ఎఫ్ఎస్ టి బృందంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక బృందం, ఎం సి సి బృందంలో ఎంపీడీవో, మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్, జోనల్ అధికారులుగా తహసిల్దార్లు ఉన్నారు. మొత్తం 97 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 232 మంది పిఓ,పిఓలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి శిక్షణ నోడల్ ఆఫీసర్ తో పాటు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, మాస్టర్ ట్రైనర్లు హాజరయ్యారు.

బీఆర్ఎస్ పట్టభద్రుల నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం

- నేడు కేటీఆర్ రాక
- నేడు ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి వాకర్స్‌తో మీట్

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీ మిర్యాలగూడ నియోజవర్గ స్థాయి ఉపఎన్నికల సన్నాహక సమావేశం ఈ నెల 21 సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎస్వీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె. తారక రామారావు (కెటీఆర్) మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారని తెలిపారు.మిర్యాలగూడ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మిర్యాలగూడ నియోజక వర్గ పట్టభద్రులు, నాయకులు, కార్యకర్తలు, పట్టణ, అన్నీ మండలాల కమిటీ అధ్యక్షులు, కార్యవర్గం, గ్రామ, టౌన్ వార్డుల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, రైతు విభాగం, మహిళా విభాగం, కార్మిక విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగం, బిసి విభాగం, ఎస్సి విభాగం, ఎస్టి విభాగం, మైనారిటీ, సోషల్ మీడియా విభాగాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నియోజకవర్గ బిఆర్ఎస్ అభిమానులు సకాలములో హాజరై సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి వాకర్స్‌తో మీట్

నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో మన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఈనెల 21న ఉదయం 5.30 కు మిర్యాలగూడ టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మార్నింగ్ వాకర్స్ తోటి మీట్ అవుతారని ఉదయం 6.15 కు మిర్యాలగూడ పట్టణంలోని క్యాంప్ మైదానం నందు మార్నింగ్ వాకర్స్ తోటి మీట్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ప్రచారంలో పాల్గొంటారని బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం పేర్కొన్నారు.



అసంతృప్తిని వదలండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయండి
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ- నకిరేకల్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తిని వదిలి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం సంఘటితంగా కృషి చేయాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నల్గొండ ఖమ్మం వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల విధానాలను ఈ సందర్భంగా దుయ్యబట్టారు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలోరాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ రేగటి మల్లికార్జున రెడ్డి, నియోజకవర్గ కౌన్సిలర్లు, మండల పార్టీలు, సర్పంచులు వార్డ్ నెంబర్లు, ఇతర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.